




మల్లన్న సన్నిధిలో లక్ష దీపోత్సవం



శ్రీశైలంలో పుష్కరిణి చుట్టూ వెలిగించిన కార్తీక దీపాలు







శ్రీశైల మహాక్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, విద్యుద్దీపాల అలంకరణలో ఆలయ గోపురం

శ్రీశైలం, నవంబరు 4 ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరణికి దశవిధ హారతుల కార్యక్రమాలను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. కార్తీకమాసంలో సోమవారం రోజులలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను పురస్కరించుకుని క్షేత్రానికి అశేష భక్తజనం తరలివచ్చారు. క్షేత్ర వీధులు భక్తుల రద్దీతో దర్శనమిచ్చాయి. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలిరావడంతో క్షేత్రం శివనామస్మరణంతో మార్మోగింది. వేకువజామునుంచే పాతాళగంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. కాగా ప్రధాన ఆలయం ఎదుట గల గంగాధర మంటపం వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ధ్వజస్తంభానికి ఆకాశ దీపం కార్యక్రమాన్ని సంప్రదాయబద్దంగా జరిపారు. లోకకళ్యాణం కోసం పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్సవం క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పుష్కరణి వద్ద లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.



స్వామి అమ్మవార్లకు పూజలు



భక్తురాలి నృత్య ప్రదర్శన

శవ రాజకీయం వైసీపీకే చెల్లు

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, నవంబరు 04 (ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాలు చేయడం వైసీపీకే చెల్లుతుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో జూలై 7వ తేదీన కనిపించకుండా పోయిన బాలిక కుటుంబానికి వైసీపీ ఆర్థిక సహాయం చేయడం మంచిదే కాని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంశాఖామంత్రులపై వైసీపీ జిల్లా నాయకులు ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. బాలిక ఘటన జరగడం దురదృష్టకరం, బాధాకరమన్నారు. ఆ ఘటనలో అనుమానితులను ఇప్పటికే కూటమి ప్రభుత్వం రిమాండ్‌కు పంపిందన్నారు. చిన్నారి ఘటనను వైసీపీ శవ రాజకీయం చేస్తోందన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఇలాంటి శవ రాజకీయాలు చేయడంతోనే రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇచ్చి పక్కన పడేశారని ఎద్దేవా చేశారు. బాధితురాలి ఘటనలో ఎలాంటి రాజకీయ కోణాలు లేవని, అది వైసీపీ నాయకులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఆర్బు శ్రీను, వేణుగోపాల్, మీనాక్షి, వనజ, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

- ప్రజలకు నష్టం కలిగే పనులు చేయం
- జలవనరుల శాఖకు పూర్వ వైభవం తీసుకువస్తాం
- డీఆర్సీ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు

7

పుట్టగొడుగుల్లా వెంచర్లు

- ల్యాండ్ కన్వర్షన్ అనుమతి లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలుదారులు

ఫిర్యాదులను పరిష్కరించండి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 178 మంది కలెక్టర్‌కు అర్జీలు సమర్పించుకున్నారు.



ప్రజల నుండి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

అక్రమ కట్టడాల కూల్చివేత

స్విమ్మింగ్ పూల్, స్నానపు గదుల తొలగింపు



అక్రమంగా నిర్మించిన జీఎస్ఎస్ గోడను కూల్చివేస్తున్న కుడా సిబ్బంది

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలపై కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం బనగానపల్లె పట్టణంలో జీఎస్ఎస్ ఫంక్షన్ హాల్ యజమాని గాథంశెట్టి వేణుగోపాల్ ఆక్రమించి నిర్మించుకున్న ఫంక్షన్ హాల్‌లోని కొంత భాగాన్ని కుడా ప్లానింగ్ అధికారి సంధ్య, బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో సతీష్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి సమక్షంలో తొలగించారు. జుర్రేరు వాగు పక్కన ఉన్న మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలంలో అక్రమంగా నిర్మించిన జీఎస్ఎస్ ఫంక్షన్ హాల్ కట్టడాలను బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, ఇతర పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ కూల్చివేతల పర్వం కొనసాగింది. మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన సుమారు 20 సెంట్ల స్థలంలో అక్రమంగా కట్టడాలు నిర్మించినట్లు మైనర్ ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్, సర్వేయర్‌లు గత నెలన్నర క్రితం సర్వే చేసి గుర్తించారు. ఫంక్షన్ యజమాని గాథంశెట్టి వేణుగోపాల్‌కు నోటీసులు కూడా జారీ చేశారు. నోటీసులు తీసుకోకపోవడంతో ఆయన ఫంక్షన్ హాల్ గోడకు నోటీసులు అంటించారు. అనంతరం రెండు ఎక్స్‌కవేటర్ల సాయంతో జుర్రేరు వాగు బఫర్ జోన్‌లో ఉన్న రెండు స్విమ్మింగ్ పూల్, కాంపౌండ్ గోడను పూర్తిగా కూల్చివేశారు. ఈ సందర్భంగా కూడా ప్లానింగ్ అధికారి సంధ్య విలేకరులతో మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మూడు వెంచర్లను కూల్చివేసినట్లు తెలిపారు. జుర్రేరు వాగుకు సంబంధించిన స్థలంలో ఉన్న స్విమ్మింగ్ పూల్, బాత్‌రూమ్‌లు, ఫంక్షన్ హాల్ గోడను నిబంధనల మేరకు కూల్చివేశామని చెప్పారు. బనగానపల్లె పట్టణంలో మరిన్ని అక్రమ కట్టడాలు ఉన్నాయని వాటిని కూడా కూల్చివేయనున్నట్లు తెలిపారు.



జీఎస్ఎస్ ఫంక్షన్ హాల్ వద్ద స్విమ్మింగ్ పూల్‌ను కూల్చి వేయిస్తున్న కుడా సిబ్బంది

పబ్లిక్ నోటీస్

తేది: 05-11-2024

నంద్యాల జిల్లాకి చెందిన అనేక సర్వే నంబర్లలో ఉన్న డ్రై అగ్రికల్చర్ భూములను మా క్లయింట్ జెంటారీ రెన్యూవబుల్స్ ఇండియా క్లస్టర్ వన్ ప్రైవేట్ లిమిటెడ్, గురుగ్రామ్, హర్యానా వారు భూమి యజమానుల వద్ద నుండి కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు సాధారణ ప్రజలకు సమాచారం అందించారు. ఆ సమాచారం మేరకు కొందరు భూమి యజమానులు మా క్లయింట్ వారికి భూములు అమ్ముటకు సమ్మతించారు. భూమి మరియు దాని యజమానుల వివరాలు షెడ్యూల్ పోర్షన్‌లో క్రింద పేర్కొనబడ్డాయి. ఈ క్రింద పేర్కొన్న యజమానులు వారు వారి షెడ్యూల్ ఆస్తులపై సంపూర్ణ యజమాన హక్కులు కలిగి సదరు భూములపై స్వాధీన అనుభవంతో ఉన్నారు.

ఏదైనా వ్యక్తి / ఆ సంస్థ / బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా హక్కు టైటిల్, క్లెయిమ్, ప్రయోజనం, ఎస్టేట్, వాటా, డిమాండ్ లేదా మరియేతర హక్కు కలిగి ఉంటే లేదా సేల్, ఐటీ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీలు లేదా దానిలోని ఏదైనా భాగానికి సంబంధించి ఏదైనా స్వభావం కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే, మార్టిగేజ్, అసైన్‌మెంట్, ఛార్జ్, దానము, ఒడంబడిక, ట్రస్ట్, లైసెన్స్, అద్దె, వాటా, ఉప-అద్దె, వారసత్వం, దావా, అనుమతి, లీజు, ఉప-లీజు, తాత్కాలిక హక్కు తనఖా, సరలింపు, రూపకల్పన, లిక్విడ్, హైపోథికేషన్, భారాలు, స్వాధీనం అభివృద్ధి హక్కులు, పార్ట్ పెర్‌ఫార్మెన్స్‌లో స్వాధీనం, భాగస్వామ్యం, కుటుంబ ఏర్పాటు / సెటిల్‌మెంట్, లిస్ పెండెన్‌లు, ఏదైనా న్యాయస్థానం యొక్క డిక్రీ ఆర్డర్ లేదా ఎలాగైనా, చట్టం యొక్క ఆపరేషన్ ద్వారా లేదా మరేదైనా, మద్దతు పత్రాలతో పాటుగా తమ అభ్యంతరాలను దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు అభ్యంతరాలను ఈ క్రింద కనపరచిన చిరునామా నందు దాఖలు చేయడంలో విఫలమైతే, షెడ్యూల్‌లో లేదా దాని మీద లేదా దానికి సంబంధించి ఎలాంటి ప్రతికూల హక్కు, టైటిల్ ఆసక్తి, వాటా, దావా లేదా డిమాండ్ ఉండదని భావించబడుతుంది. ఆస్తి వివరములు.

భూమి మరియు దాని యజమానుల షెడ్యూల్ మరియు వివరాలు వరుసగా

వ. నం	రైతు పేరు	ఖాతా నెం.	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణం	గ్రామం	మండలం
	మిద్దె రంగస్వామి S/o చిన్న సుబ్బన్న	1175	811/3	1.50	డోన్	డోన్
	దళవాయి మల్లికార్జున	2652	811/3	1.50	డోన్	డోన్
1	మనెకె రంగన్న S/o చిన్న సుబ్బన్న	1180	811/3	1.50	డోన్	డోన్
	మనెకె నాగన్న S/o నారప్ప	2786	811/2	2.00	డోన్	డోన్
	బోగుల రత్నమ్మ W/o గొగ్గుల రాముడు	1404	811/3	0.75	డోన్	డోన్
	బోగుల రత్నమ్మ W/o గొగ్గుల రాముడు	1404	811/4A	1.70	డోన్	డోన్
	మనెకె గంగమ్మ W/o మనెకె నాగన్న	700	1022	2.00	డోన్	డోన్
2	వాకలి పుల్లయ్య S/o. చిన్న వెంకట స్వామి	4372	1022	1.00	డోన్	డోన్
	బరికె అచ్చెమ్మ W/o. యమన్న	207	1022	1.00	డోన్	డోన్
	కాసిబోయిని యామయ్య S/o.కాసిబోయిని పెద్దన్న	980	1022	2.00	డోన్	డోన్
	షేక్ ఖమురున్ W/o. షేక్ ఇస్మాయిల్	5886	153-B	1.25	కొత్తపల్లి	బేతంచెర్ల
	మీలా మహాలక్ష్మి W/o ఎం. శ్రీనివాసులు	5864	153-A	1.75	కొత్తపల్లి	బేతంచెర్ల
3	కందగడ్డల రామమూర్తి S/o రామయ్య	1699	153	2.18	కొత్తపల్లి	బేతంచెర్ల
	చల్లా రమేష్ S/o చల్లా రామమద్ది	1203	153	2.62	కొత్తపల్లి	బేతంచెర్ల
	జక్కా బాల భారతి W/o జక్కా మద్దిలేటిశెట్టి	1598	154/A	1.75	కొత్తపల్లి	బేతంచెర్ల
	పి.సంజీవనాయుడు S/o లేట్ దివాకర్ నాయుడు	1547	379-5	1.86	కోచెరువు	డోన్
4	పి.ప్రతాప్ నాయుడు S/o లేట్ దివాకర్ నాయుడు	1545	379-5	3.00	కోచెరువు	డోన్
	పి.లక్ష్మయ్య నాయుడు S/o లేట్ దివాకర్ నాయుడు	1546	379-5	3.00	కోచెరువు	డోన్
	మొకాసి పెద్ద పుల్లయ్య S/o మొకాసి చెన్నయ్య	1416	693	3.73	కొత్తపల్లి	బేతంచెర్ల
5	మొకాసి సీతరాముడు S/o పెద్ద తిమ్మయ్య	880	707/B	1.90	కొత్తపల్లి	బేతంచెర్ల
	ఎం.చిన్నపుల్లయ్య S/o బాల చెన్నయ్య	843	693	1.97	కొత్తపల్లి	బేతంచెర్ల
	మొకాసి వెంకట సుబ్బమ్మ W/o మొకాసి సుబ్బరాయుడు	2106	707/B	0.97	కొత్తపల్లి	బేతంచెర్ల
6	ఉల్లి రాముడు S/o ఉల్లి పెద్దన్న ఉరఫ్ సుంకన్న	1091	469	2.20	గుటపల్లె	బేతంచెర్ల
	ఉల్లి శ్రీరాములు S/o ఉల్లి పాపన్న	1089	469	2.20	గుటపల్లె	బేతంచెర్ల

శ్రీ V.A.N. మూర్తి, లా ఛాంబర్స్ : 8-2-120/86/9,303,
3వ అంతస్తు, GK బిమ్స్ స్క్వేర్, ఎదురుగా: పార్క్ హయత్ హోటల్ బంజారా హిల్స్ రోడ్ నెం.2, హైదరాబాద్-500034, తెలంగాణ. మొబైల్ నంబర్ : +91 99668 07021
ఇమెయిల్ : vm305239@gmail.com, prataplawofficehyd@gmail.com

పొత్తుకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

సమన్వయ బాధ్యత ఎమ్మెల్యేలదే

- సాగునీరు, సహకార ఎన్నికలపై దృష్టి సారించండి
- టీడీపీ హయాంలోనే సీమ ప్రాజెక్టులకు ప్రాధాన్యత
- కప్పట్రాళ్ల యురేనియం పాపం వైసీపీదే
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



కర్నూలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొత్తు ధర్మాన్ని అందరూ విధిగా పాటించాలి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను సమన్వయం చేసుకొని సమష్టిగా ముందుకు నవడవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనే ఉందని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మంత్రి టీజీ భరత్‌తో కలసి నిమ్మల సుడిగాలి పర్యటన చేశారు. స్టేట్ గేస్ట్‌హౌస్‌లో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి ఉల్లి రైతులతో మాట్లాడారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశమై నియోజవర్గాలలో చేపట్టాల్సిన అభివృద్ధి, అసంపూర్తి పనులపై చర్చించారు. ఆయా నియోజకవర్గాల్లో కూటమి నేతల మధ్య నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జనసేన అధ్యక్షుడు చింతా సురేశ్‌బాబు హాజరు అయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల ముఖ్య నాయకుల నుంచి జిల్లా అభివృద్ధిపై సూచనలు స్వీరించారు. నాయకులు వెల్లడించిన ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా మంత్రి నిమ్మల నోట్ చేసుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి అధ్యక్షతన జరిగిన కూటమి ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ముఖద్వారం కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పని చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. కర్నూలును ప్రగతి పథంలో ప్రథమ స్థానంలో నిలుపుతానని, డ్రోన్ హబ్‌గా మారుస్తానని వివరించారు.

మిగతా 6లో..

ఆన్‌లైన్ కథలు



ఊ కొడతారా కథ చెబుతా

- సోషల్ మీడియాలో బాలలకు సాహిత్యం
- యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, టెలిగ్రామ్‌లలో వేలాదిగా సభ్యులు
- రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ వినూత్న ప్రయోగానికి స్పందన

కర్నూలు కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ తెల్లవారుతూనే ఓ కథ, ఓ పొడుపు కథ, ఒక సామెత, ఒక గేయం వంటివి సోషల్ మీడియాలో పెట్టి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతున్నారు కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ప్రవృత్తి పరంగా వందలాది కథలు రాశారు. అనేక పుస్తకాలు వెలువరించారు. ప్రత్యేకించి పిల్లల్లో తెలుగు భాష, సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగేలా ఆయన రచనలు దోహద పడుతున్నాయి. అంతేకాదు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు హరికిషన్ కథలు, సాహిత్యాన్ని తరగతి గదిలో పిల్లలకు పంచుతూ వారిని భాషాభిమానులుగా తీర్చిదిద్దుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా డాక్టర్ హరికిషన్ తన సాహితీ ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. ఆయనకు ఒక్క వాట్సాప్‌లోనే 38 గ్రూపుల్లో సాహిత్యాభిలాషులు ఉన్నారు.

కరోనా కల్పించిన వినూత్న ఆలోచన...

కర్నూలుకు చెందిన డాక్టర్ ఎం.హరికిషన్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఈయన కోడుమూరు మండలం అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల్లో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు 75 పుస్తకాలు వెలువరించారు. 16 ఏళ్ల క్రితం తొలుత సామాజిక సమస్యలపై కలం ఎక్కుపెట్టి అనేక కథలు రాశారు. రాయలసీమ కథా సాహిత్యాన్ని తెలుగు సాహితీ ప్రియులకు అందించడానికి 'సీమ కథల సంకలనాలు' వెలువరించారు. తర్వాత బాల సాహిత్యంపై దృష్టి పెట్టి అంతరించిపోతున్న జానపద బాల సాహిత్యాన్ని పరిరక్షించడానికి 18 పుస్తకాలు ప్రచురించారు. ఇవన్నీ బాలల్లో ఆసక్తిని కలిగించేలా శ్రద్ధ తీసుకున్నారు. బాలల్లో తెలుగు భాష పట్ల మమకారం పెరిగేలా సంయుక్త అక్షరాలు, ఒత్తులు లేకుండా కథలు, గేయాలు, నవలలు రాశారు. కోవిడ్-19 సమయంలో దేశమంతా ఇళ్లకే పరిమితమైన సమయలో ఆయనకు ఒక కొత్త ఆలోచన తట్టింది. దీంతో 'వంద రోజులు-వంద కథలు' పేరుతో ఆయన వాట్సాప్ వేదికగా ప్రతిరోజూ ఒక కథ, గేయం, పొడుపు కథ, సామెతని వాట్సాప్, ఫేస్‌బుక్ తదితరాల్లో పోస్టు చేసేవారు. వీటిని వీలైనంత మందికి చేరువ చేసేందుకు 32 గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. ఒక్క గ్రూప్‌లో ప్రస్తుతం 1014 మందికి అవకాశం లభిస్తోంది. ఇలా ఒక రోజులో సుమారు 58 వేల మందికి ఇవి చేరుతున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ వీటిని ప్రింటు కూడా తీసుకొని పిల్లలకు జెపెగ్(చిత్రం)రూపంలో అందిస్తున్నారు. సామెతల్లో పదాల స్థానంలో బొమ్మలు ఉంచి పిల్లలు నేర్చుకోవడానికి ఆహ్లాదంగా మారుస్తున్నారు. 'చెప్పుకోండి చూద్దాం' పేరుతో బొమ్మలతో పొడుపు కథలు అడుగుతున్నారు. ప్రతి ఆదివారం ఒక సామాజిక సమస్యపై కథ పోస్టు చేస్తున్నారు. అలాగే వాట్సాప్‌లో అందుబాటులో ఉండే బ్రాడ్‌కాస్ట్ గ్రూపుల ద్వారా రెండున్నర వేల మందికి వీటిని చేరువ చేస్తున్నారు. ఈ గ్రూప్‌ను లింక్‌ను కోరుకునేవారు సెల్ నెం. 9441032212కు 'హాయ్' అని పెడితే రచయిత లింక్ అందజేస్తున్నారు.

యూట్యూబ్‌లో 'హరి' కథలు....

డాక్టర్ ఎం. హరికిషన్ యూట్యూబ్‌లో 'హరి'కథలు పేరుతో ఒక చానెల్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ చానెల్‌లో 200లకు పైగా కథలను చదివి వినిపించారు. ఈ చానెల్‌కు సుమారు 50 వేలకు పైగా సబ్‌స్ర్కైబర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో 'హరికిషన్ కర్నూలు' పేరుతో కర్నూలు జిల్లా చరిత్ర, చారిత్రక ప్రదేశాలు, ఆలయాలు, స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు పొందుపరిచారు. 'వంద రోజులు-వంద కథలు' శీర్షికలో మధ్యలో చేరేవారి కోసం ప్రత్యేకంగా ఒక టెలిగ్రాం గ్రూపును హరికిషన్ ప్రారంభించారు. ఇందులో ప్రస్తుతం ఐదు వేల మంది చేరారు. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ 'హరికిషన్ కర్నూలు' పేరుతో కథలు, గేయాలు, సామెతలు పోస్టు చేస్తున్నారు. అలాగే 'ప్రతి లిపి' అనే అనే తెలుగు సాహిత్య మాధ్యమంలోనూ తన కథలు హరికిషన్ అందుబాటులో ఉంచారు. ఇక ఇంటర్నెట్ ఆర్కైవ్స్‌లో కూడా కథలన్నీ భద్రపరిచారు. హరికిషన్ బాలల గేయాలు, బాలల కథలు అని ఇంటర్నెట్‌లో సెర్చ్ చేస్తే కూడా అవన్నీ లభిస్తాయి. ఇటీవల 'కోరా' అనే మాధ్యమంలోనూ బాలల కథన్ని డాక్టర్ ఎం. హరికిషన్ ప్రచారం చేస్తున్నారు.



యూట్యూబ్ చానెల్‌లో హరికిషన్ జానపద కథలు

భాష, సాహిత్యం ప్రజలకు చేరడమే ముఖ్యం



తెలుగు భాషా, సాహిత్యాలు ప్రజలకు చేరడమే ముఖ్యంగా భావిస్తాను. ఒకప్పుడు పుస్తకాలు చదవడం ఒక్కటే అవకాశంగా ఉండేది. మారుతున్న కాలంలో ఆధునిక విధానాలు సాహిత్యంపై కూడా ప్రభావితం చూపుతున్నాయి. ఈ తరుణంలో సోషల్ మీడియాను వేదికగా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోవిడ్-19 సమయంలో ప్రారంభించిన సోషల్ మీడియాలో నా ప్రస్థానం ఏడాది తర్వాత ఆపేద్దామని అనుకున్నా. కానీ వీక్షకుల నుంచి వస్తున్న విపరీతమైన ప్రతి స్పందన నాపై బాధ్యతను పెంచింది. అందుకే ప్రతిరోజూ కొంత సమయం కేటాయించుకొని బాలల కోసం నావంతు ప్రయత్నం చేస్తున్నా. తెలుగు భాషపై మమకారం పెరిగి, నా కథలు, గేయాలు, సాహిత్యం విద్యార్థులకు ప్రయోజనకరంగా మారితే అదే నాకు గొప్ప సంతోషం. అదే గొప్ప సంతృప్తి.

- డాక్టర్ ఎం. హరికిషన్, బాల సాహితీవేత్త, కర్నూలు



టెలిగ్రాం మాధ్యమం వేదికగా 'వంద రోజులు-వంద కథలు'



ఫేస్‌బుక్‌లో 'హరికిషన్ బాలల కథలు'

అధికారులపై చర్యలు తీసుకోండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సంబంధం లేని అంశాలను అప్‌లోడు చేసిన వెల్దుర్తి ఈవోపీఆర్‌డీపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో, డీపీవోను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కర్నూలు మున్సిపాలిటీకి సంబంధించిన టౌన్ ప్లానింగ్ విభాగపు అధికారిపై చర్యల తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కొంత మంది అధికారులు వచ్చిన అర్జీకి సరైన ఎండార్స్‌మెంటు ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎండార్స్‌మెంటు, విచారణ నివేదికలను అప్‌లోడు చేయడంపై అధికారులకు సరైన స్పష్టత లేదని, ఈ అంశాలపై జిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని అన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు 20 పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ సరైనవిధంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, నాగప్రసన్నలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

రాఘవేంద్రుని సన్నిధిలో సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్

మంత్రాలయం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తండ్రి సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ సోమవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. సాధారణ భక్తుడిలా వచ్చి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట సూపరింటెండెంట్ అనంతపురాణిక్, బిందు మాధవ్, అనంత స్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, సీపీ స్వామి ఉన్నారు.


శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్

టెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్

150కి 150 మార్కులు సాధించిన క్రాంతి కుమార్



అవుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా అవుకు మండలం నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి క్రాంతికుమార్ సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో 150-150 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ నిలిచారు. నిచ్చెనమెట్ల గ్రామానికి చెందిన తలారి క్రిష్ణయ్య, భూలక్ష్మి దంపతులకు మనోజ్‌కుమార్, క్రాంతికుమార్‌లు సంతానం. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారులకు చదువుపై ఉన్న ఆసక్తిని గమనించి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కష్టపడి చదివించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన క్రాంతి కుమార్ 1 నుంచి 5వ తరగతి వరకు నిచ్చెనమెట్ల ప్రాథమిక పాఠశాల, 6 నుంచి 10 వరకు గుండ్లశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ నంద్యాల నలంద కళాశాలలో పూర్తి చేశాడు. డిగ్రీ బనగానపల్లె ఎస్వీ కళాశాల, టీటీసీ బనగానపల్లె శ్రీలక్ష్మి కళాశాలలో చదువుకున్నారు. కష్టపడి చదివి టెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సువర్ణ అవకాశం

టెట్ ఫలితాల్లో కోసిగి అభ్యర్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంకు



కోసిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అక్షరాస్యతలో చిట్టచివరి నుంచి రెండో స్థానంలో కోసిగి మండలం ఉంది. అలాంటి మండల కేంద్రానికి చెందిన ముకుంద సువర్ణ సోమవారం విడుదలైన టెట్ ఫలితాల్లో 146.89 /150 మార్కులతో రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంకు సాధించింది. అలాగే కర్నూలు జిల్లాలో మొదటి ర్యాంకు దక్కించుకొని అందరితో శభాష్ అనిపించుకుంది. కోసిగిలోని 7వ వార్డుకు చెందిన ముకుంద కృష్ణమూర్తి, పద్మావతి దంపతుల మొదటి కుమార్తె ముకుంద సువర్ణ 2016లో కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఇంటర్ కర్నూలులోని సెయింట్ జోసెఫ్‌లో చదివింది. కోసిగిలోని నారాయణ డిగ్రీ కళాశాలలో డిగ్రీ (బీఎస్సీ), సాయిప్రతిభ కాలేజీలో బీఈడీ పూర్తి చేసింది. ఆ తరువాత 2020లో కర్నూలులోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుని టెట్ ఫలితాల్లో 150 మార్కులకుగాను 146.89 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి టాప్ ర్యాంకుతోపాటు జిల్లా స్థాయి మొదటి ర్యాంకు దక్కించుకుంది. అయితే.. టెట్ పరీక్ష రాసే సమయంలో సువర్ణ తన రెండు నెలల కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో టెట్ పరీక్ష రాసింది. కోసిగి మండలం నుంచి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల కోసిగి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీచరు ఉద్యోగం సాధిస్తా

త్వరలో నిర్వహించే డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించి తీరుతా. మా కోసిగి మండలంలో అక్షరాస్యత పెంపొందించేందుకు కృషి చేస్తాను. తల్లిదండ్రులతో పాటు భర్త రామాంజనేయులు సహకారంతోనే టెట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. అలాగే కర్నూలులోని ప్రతిభ కోచింగ్ సెంటర్ యాజమాన్యం సహకారంతోనే ఈరోజు ఈ ఫలితం సాధ్యమైంది.

- ఎం.సువర్ణ, కోసిగి


తన రెండు నెలల కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి టెట్ పరీక్ష రాసిన జిల్లా ఫస్ట్ ర్యాంకర్ ఎం.సువర్ణ (ఫైల్)

ఎస్పీకి 88 ఫిర్యాదులు

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 88 ఫిర్యాదులు అందాయి. వీటిని ఎస్పీ బిందుమాధవ్ నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్‌బీఐ యోనో బ్యాంకు రివార్డ్ పేరిట వాట్సప్‌లో వచ్చిన లింక్ ద్వారా రూ.47,856 మోసపోయానని కర్నూలు వాసవీనగర్‌కు చెందిన మోహన్ ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా తన తమ్ముళ్లకు అటెండర్, వాచ్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి శారదమ్మ అనే మహిళ రూ.5.50 లక్షలు మోసం చేసిందని కర్నూలు బుధవారపేటకు చెందిన వాణి, పుష్పలత ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తుకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

(5వ పేజీ తరువాయి)

రాయలసీమ ప్రాజెక్టులకు ఆద్యుడు ఎన్టీఆర్ అని, ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేసిన ఘనత చంద్రబాబుది అని మంత్రి నిమ్మల అన్నారు. అయితే.. ఆ విషయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో టీడీపీ కార్యకర్తలు విఫలమయ్యారని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం చేసిందని, వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల జలాశయం నిర్మాణ పనులు, హంద్రీ నీవా పత్తికొండ కుడి ఎడమ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు అసంపూర్తి పనులు, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, అలగనూరు జలాశయం మరమ్మతు పనులు చేపడుతామన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మాట్లాడి జిల్లాల్లో రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. వలసల నివారణకు టమోటా ప్రాసెసింగ్‌తో పాటు వివిధ పరిశ్రమలు తీసుకొస్తాం అన్నారు. కప్పట్రాళ్లలో యురేనియం సర్వే కోసం 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చి.. ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, వైసీపీ ఎత్తులు తిప్పికొట్టాలని సూచించారు. సాగునీటి సంఘాల ఎన్నికలతో పాటు సహకార ఎన్నికల్లో కూటమి 93 శాతం స్ట్రైక్‌రేట్ అందుకోవాలని సూచించారు. టిడ్కో ఇళ్లకు వైసీపీ ప్రభుత్వం గంపెడు మట్టి కూడా వేయలేదని, ఆ ఇళ్లను తాకట్టు పెట్టి రూ.5 వేలు కోట్లు అప్పు తీసుకుందని పేర్కొన్నారు. త్వరలో లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ మంత్రాలయంలో ఇసుక ఉందని, ఎవరైనా ఇసుక రౌడీ మామూళ్లు అడిగితే తనకు ఫోన్ చేస్తే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏ నియోజకవర్గంలోనైనా కూటమి నాయకుల మధ్య సమస్యలు తలెత్తితే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జనసేన అధ్యక్షుడు చింతా సురేశ్‌బాబు మాట్లాడారు.

వలసలు ఆపేందుకు పరిశ్రమలు

- మంత్రి టీజీ భరత్:

జిల్లాలో ఏటా 2.50 లక్షల మంది వలసలు వెళ్తున్నారని, వలసలు ఆపేందుకు జిల్లాలో పరిశ్రమలు తీసుకొస్తామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు చేసి తీరుతామని, దేశంలో 26 రాష్ట్రాల కంటే అత్యధిక పింఛన్ ఇస్తున్నది మన రాష్ట్రమే అని, ఆ ఘనత చంద్రబాబుదే అన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకొని ముందుకు వెళ్దామని పిలుపు ఇచ్చారు. టీడీపీ ఓటమి కోసం పని చేసిన వాళ్ల షెల్టర్ కోసం జనసేన, బీజేపీలోకి వెళ్తున్నారని.. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని టీజీ భరత్ సూచించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, కర్నూలు-బళ్లారి రోడ్డు జాతీయ రహదారిగా మార్చాలని కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పొత్తును విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ కరువు సీమకు సాగునీరు ఇవ్వాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా గుండ్రేవుల ప్రాజెక్టు అడుగుతున్నారని తక్షణమే చేపట్టాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకుడు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్వగ్రామం రాంపురంలోకి ఏ పార్టీ నాయకులనూ రానివ్వడం లేదని, అక్కడ అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, ఆ ఊరు పాకిస్తాన్‌లో ఉందా..? అంటూ నిలదీశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కూటమి నాయకుల సమష్టి కృషి వల్లే విజయం సాధించామని, అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో టీడీపీ ఎంత షేర్ అడుతున్నారో.. మిగిలిన నియోజకవర్గాల్లో బీజేపీ, జనసేనకు అంతే షేర్ ఇస్తున్నారా..? అక్కడ వదిలేసి ఆదోని గురించి ఒక్కటే అడగడం భావ్యమా? అని పేర్కొన్నారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడుతూ ఆదోని రాజకీయ పరిస్థితి మంత్రులకు తెలుసని, వారే పరిష్కరించాలని అన్నారు. ఆరేకల్లు మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాల, షాదీఖానాలపై దృష్టి పెట్టాలన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప మాట్లాడుతూ మూడు పార్టీల మధ్య సమన్వయం సాధించాలని, కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని, ఈ విషయం పెద్దలు సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టుకు ఫేజ్-1 కింద రూ.200 కోట్లు ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, కర్నూలు, మంత్రాలయం జనసేన ఇన్‌చార్జిలు హర్షద్, లక్ష్మన్న మాట్లాడారు.


చర్చించుకుంటున్న మంత్రులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

యురేనియంపై ఆందోళన వద్దు

- ప్రజలకు నష్టం కలిగే పనులు చేయం
- జలవనరుల శాఖకు పూర్వ వైభవం తీసుకువస్తాం
- ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయండి
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- డీఆర్సీ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మాది ప్రజా ప్రభుత్వం. ప్రజలకు నష్టం చేకూర్చే పనులు ఏ ఒక్కటీ చేసేది లేదు. యురేనియం తవ్వకాలకు సంబంధించి ఆందోళన చెందకండి..' అని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు భరోసానిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి సమావేశం జరిగింది. వ్యవసాయం, ఉద్యానం, నీటి పారుదల, సాగునీరు, ఇసుక, వైద్యం, ఆరోగ్యం తదితర అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు





సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు

మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. గత పాలనకు భిన్నంగా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే 200 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదవాని కడుపు నింపుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణమైతే భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కరువ రహిత రాష్ట్రంగా అవుతుందని తెలిపారు. 2022లో గత ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు సంబంధించి సర్వేకి అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు. వచ్చే సంవత్సర కాలంలో హంద్రీనీవా మీద రూ.2800 కోట్లు ఖర్చు పెట్టి హంద్రీనీవా ద్వారా ప్రస్తుతం వస్తున్న 1800 క్యూసెక్కుల నీటి నుంచి 3,850 క్యూసెక్కులకు నీరు వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

> రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పశుసంవర్ధక, మార్కెటింగ్, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించి పథకాల గురించి సోషల్ మీడియాలో, సిటి కేబుల్ చానల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి వాల్మీకి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పత్తి మార్కెట్ యార్డు ఆదోనిలో ఉందన్నారు. వర్షం పడితే తగినన్ని షెడ్లు లేక వేరుశనగ బుడ్డలు కొట్టుకుపోతున్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేదని, వర్షం వల్ల తడిసిన పంటలను ఆరబెట్టుకోవడానికి తగిన షెడ్లు లేవని మార్కెట్ యార్డులో రైతులు విశ్రాంతి తీసుకోవడం కోసం ఉన్న భవనం గత ఏడు సంవత్సరాలుగా మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల మూత పడిందన్నారు.
- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డును విశాఖపట్నంకు తరలించవద్దని, కర్నూలులోనే బోర్డు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కర్నూలు మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్న కోల్డ్ స్టోరేజీ ప్లాంటు పనులు ఆగిపోయాయనీ, 30 శాతం పనులు మాత్రమే మిగిలిపోయాయనీ మిగిలిన పనులు చేయడానికి రూ.4 కోట్లు విడుదల చేసినట్లయితే మిర్చి పంటను కోల్డ్ స్టోరేజీలో ఉంచి కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలో మొత్తం నీటి నిల్వలు 6 టీఎంసీలు మాత్రమే ఉందని, ఇది జిల్లాకు ఏ మాత్రం సరిపోదని, 80 టీఎంసీల శ్రీశైలం నీటిని పశ్చిమ ప్రాంతానికి ఇవ్వాలని కోరారు. గుండ్రేవుల ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి వలసలు నివారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు.
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం కాపాడే లైవ్‌స్టాక్ వ్యాక్సిన్ యూనిట్ ఇప్పటికీ హైదరాబాదులో ఉండిపోయిందని, లైవ్ స్టాక్ యూనిట్ బనవాసిలో ఉండాలని కోరారు. గాజులదిన్నె ప్రాజెక్టు సంబంధించి 110వ కిలోమీటర్ల స్లూయిస్ దగ్గర హంద్రీనది నీరు కలుస్తుందని, వాటర్ డిమాండ్‌ను పెంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు నీరు వచ్చేలా చేయాలని సూచించారు.
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా అంటేనే కరువు జిల్లాగా పేరు పొందిందన్నారు. కర్నూలు పట్టణానికి తాగునీరు, రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా ఉండాలంటే తప్పనిసరిగా గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి పాణ్యం నియోజకవర్గంలో 16 వార్డులు ఉన్నాయని, సుమారు 4 నుంచి 5 రోజులకు ఒకసారి తాగునీరు వస్తుందన్నారు. ఐఐఐటీ కళాశాలకు రూ.22 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఫిల్టర్ బెడ్స్ కోసం మునగాలపాడు వద్ద ఒకటిన్నర ఎకరా భూసేకరణ చేయాలని, సంపు కోసం అర్ధ ఎకరా కావాలని కోరారు.

> పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ 2014-19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం రూ.260 కోట్లు ఖర్చు పెట్టి చెరువులు నింపే కార్యక్రమానికి పనులు మొదలు పెట్టగా.. గత వైసీపీ ప్రభుత్వం ఏమీ చేయకుండా వదిలేసిందని తెలిపారు. ప్రస్తుతం ఆ పైపులు లీకేజీ అయి పొలాలు చెడిపోతున్నాయనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనీ తెలిపారు. పైపులైన్ ఆపరేషన్ మెయింటెనెన్స్ మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఆదోని మార్కెట్ యార్డు డ్రైనేజీల నిర్మాణంలో ఆదోని మార్కెట్ యార్డు అధికారులతో సమీక్ష నిర్వహించి నిధుల మంజూరుకు డీవో లెటర్ పంపాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుచ్చకాయలమడ గ్రామంలో పర్యటించిన సమయంలో హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ నుంచి గ్రావిటి రూపంలో నీటిని అందించేందుకు ఎస్టిమేట్లు తయారు చేసి పంపించామన్నారు. వాటి ద్వారా 5వేల ఎకరాలకు 40 నుంచి 50 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని కలెక్టర్ మంత్రి దృష్టికి తీసుకుని రాగా, వెంటనే అందుకు సంబంధించిన ప్రతిపాదనల కాపీని పంపించాలని మంత్రి సూచించారు. సుంకేసుల డ్యాం నుంచి కిందకు 12 కి.మీల వరకు అక్రమంగా ఇసుక తవ్వకుండా చూడాలని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి కోరగా.. అక్కడ తనిఖీలు చేయాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు.

పుట్టగొడుగుల్లా వెంచర్లు

- ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలుదారులు
- జాతీయ రహదారి పక్కనే దందా
- విచారణ చేపట్టిన అధికారులు

గోనెగండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోనెగండలో రియల్టర్లు రెచ్చిపోతున్నారు. తమ ఇష్టానుసారం వెంచర్లు వేసి అమ్మకాలు జరుపుకుంటున్నారు. గోనెగండ్ల జాతీయ రహదారి పక్కన ఎకరం పొలం రూ. కోటి దాకా ధర పలుకుతున్నది. పొలం యజమానుల మధ్య పోటీ పెట్టి భూముల ధరలను రియల్టర్లు ఇష్టానుసారంగా పెంచుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న పంట భూములను రైతు దగ్గర నుంచి కొని రెవెన్యూ, పంచాయతీ అనుమతులు లేకుండా ప్లాట్‌లను వేసి అమ్ముకుంటున్నారు.



గోనెగండ్లలో పంచాయతీ అనుమతి లేకుండా వేసిన వెంచర్

పల్లెలకు సైతం..

ఈ వ్యాపారం పట్టణాల నుంచి మండల కేంద్రాలకు, అక్కడి నుంచి పల్లెలకు పాకుతున్నది. మండలంలోని పలు గ్రామాల్లో ఈ రకంగా అక్రమంగా ప్లాట్లులు వే సి అమ్మకాలు జరుపుతున్నారు. కొందరు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నా రనే విమర్శలు కూడా ఉన్నాయి.

పంచాయతీ అధికారులకు ఫిర్యాదు..

గోనెగండ్లలో జాతీయ రాహదారి పక్కనే 554/ఏ అనే సర్వేనెంబర్‌లో 43 సెట్ల భూమిలో ప్లాట్లు వేశారు. అయితే పంట భూములను కొందరు రియల్టర్‌లు ప్లాట్ వేస్తున్నారు. వ్యవసా యభూమిని నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చకుండా విక్రయి స్తున్నారని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం పంచాయతీ అధికారులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు అక్రమ లే అవుట్ వేసిన భూమిలోని సర్వే నెంబర్ రాళ్లను తొలగించారు. తహసీల్దార్ సైతం పనులు నిలిపివేయాలని వీఆర్వోను పంపించినట్లు తెలిపారు.

ఈ నిబంధనలు తప్పని సరి

వ్యవసాయభూమిని ప్లాట్‌గా మార్చి అమ్మాలంటే ముందుగా ఆర్‌డీవో నుంచి ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. అంత కంటే ముందు అగ్రికల్చర్ ల్యాండ్‌ను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయించాలి. అనంతరం పంచాయతీ నుంచి లేఅవుట్ అప్రూవల్ చేయించాలి. అప్పుడు పంచాయతీ అధికారులు ఎల్‌సీ నెంబర్ కేటాయిస్తారు. అనంతరం 'కుడా' పర్మిషన్ పొందిన తరువాత నిబంధనల ప్రకారం పార్క్, రోడ్డు స్థలాలు కేటాయించాలి. అయితే ఈ నిబంధనలను పాటించకుండా ప్లాట్ వేసి అమ్మకాలు జరుపుతున్నారు.

అక్రమ లే అవుట్లు వేస్తే చర్యలు తప్పవు



గోనెగండ్లలో పంచాయతీ అనుమతి లేకుండా నిబంధనలు పాటించకుండా లే అవుట్లు వేస్తే సహించేది లేదు. ప్రస్తుతం పంచాయతీ అనుమతి లేకుండా గ్రామంలో 554/ఏలో లే అవుట్ వేశారు. వారికి నోటీస్‌లు కూడా అందజేశాం.

- సతీష్. పంచాయతీ కార్యదర్శి గోనెగండ్ల.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 84 ఫిర్యాదులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 84 ఫిర్యాదులు అందాయి. వాటిని స్వయంగా స్వీకరించిన ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. వికలాంగు లు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పోలీసు సబ్ డివిజన్లతోపాటు సర్కిల్, పోలీసు స్టేషన్లలో కూడా నిర్వహి స్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి నంద్యాలకు రాకుం డా వారికి సమీపంలోని పోలీసు స్టేషన్లలో కూడా ఫిర్యాదులు సమర్పించవచ్చని ఎస్పీ సూచించారు.. ఏఎస్పీ యుగంధర్‌బాబు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే ఉపేక్షించం



ఉల్లిగడ్డల రైతుతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

- దళారుల పట్ల అప్రమత్తంగా ఉండండి
- మార్కెట్ అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

కర్నూలు అగ్రికల్చర్/అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో దళారుల పట్ల అప్రమత్తంగా ఉండండి.. రైతులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. జిల్లా మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలసి కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం సందర్శించారు. మార్కెట్‌లో నడుస్తూ ఉల్లి సహా ఇతర పంటలు అమ్మకానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. పత్తికొండ మండలం మారెల్ల గ్రామానికి చెందిన రైతు లాలప్ప, కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన రైతు మునిస్వామి, దేవనకొండ మండలం ఐరన్‌బండ గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులతో మంత్రులు మాట్లాడారు. ఉల్లి దిగుబడులు, ధర, మార్కెట్‌లో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి పెరిగిందని, గతంలో పోలిస్తే ధర ఆశాజనకంగా ఉందని రైతులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ఏడాది వైసీపీ ప్రభుత్వంలో అక్టోబరు నెలలో 51 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వస్తే క్వింటా ధర సగటున రూ.2 వేలు కూడా పలకలేదని, ఈ ఏడాది అక్టోబరులో 1.51 లక్షల బస్తాలు దిగుబడి వచ్చిందని, సగటు ధర రూ.3,500 వరకు వచ్చిందని వివరించారు.

ఇ-నామ్ సర్వర్ సమస్య వల్ల కొంత ఇబ్బంది వస్తే.. మ్యానువల్‌గా కొనుగోలు చేయమని ఆదేశించామని తెలిపారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించే అవకాశం ఉందని, అలాంటి వారిపై నిఘా ఉంచాలని మార్కెట్ సెక్రెటరీ విజయలక్ష్మిని ఆదేశించారు. మంత్రులతో పాటు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తదితరులు ఉన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని నాయకులకు ఆదేశించారు.

ఎరువుల కొరత లేదు



మార్క్‌ఫెడ్ చైర్మన్‌ను సన్మానిస్తున్న అధికారులు

- గ్రామాల్లో అన్ని ఎరువులు రైతులకు అందుబాటులో
- మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారు రాజు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో అవసరమైన అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని, వ్యాపారులు దళారులు యూరియా, డీఏపీ తదితర కాంప్లెక్స్ ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు రైతులకు అంటగడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ యంత్రాంగానికి విజ్ఞప్తి చేసినట్లు మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ బంగారు రాజు తెలిపారు. అమరావతి నుంచి సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటన చేసిన మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్నూలులోని మార్క్‌పెడ్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల మేనేజర్లు రాజు, సురేష్ ఆయనను సన్మానించారు. చైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ ఎరువులను గ్రామాల్లోని రైతులందరికీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎంఆర్‌పీ ధరకే అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమాలు జరుగుతుంటే.. మార్క్‌ఫెడ్ మేనేజర్లకు ఫిర్యాదు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందకున్నా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ఆనాటి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తాము కేంద్రం, రాష్ట్రం ప్రకటించిన మద్దతు ధరలు అందకుంటే వెంటనే రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, మార్క్‌ఫెడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు



నిందితుడిని మీడియాకు చూపుతున్న సీఐ

పాణ్యం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితుడ్ని సోమవారం గడివేముల బస్టాండు సమీపంలో అరెస్టు చేసినట్లు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన వడ్డె సుబ్బరాయుడు నంద్యాల పట్టణం హనీఫ్ నగర్‌లో నివాసముంటున్నాడన్నారు. నిందితుడు 1997 నుంచి దొంగతనాలకు అలవాటు పడినట్లు తెలిపారు. రాత్రివేళల్లో దొంగతనాలు చేస్తూ దోచుకున్న నగదు, బంగారు నగలను అమ్మి విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నట్లు తెలిపారు. 2023లో గడివేముల పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం, దొంగతనం కేసు నమోదైనట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామన్నారు.

జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం

వెలుగోడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు జలాశయంలో సోమవారం ఓ గుర్తు తెలియని యువకుడి శవం లభ్యమైనట్లు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు. సుమారు 40 సంవత్సరాలలోపు వయస్సు ఉంటుందని అన్నారు. శవం తేలాడుతున్నట్లు సమాచారం రావడంతో బయటకు తీశామని చెప్పారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పోలీసుల అదుపులో వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి

మహానంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఇ. బొల్లవరం గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి తిరుమల కృష్ణను ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కర్నూలుకు చెందిన సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిరుమల కృష్ణపై గతంలో కర్నూలు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే అక్కడి సీసీ పోలీసులు తిరుమల కృష్ణను గ్రామంలోని ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని కర్నూలుకు తరలించినట్లు సమాచారం. మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డిని వివరణ కోరగా వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి తిరుమల కృష్ణను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకొన్న విషయంపై తమకు సమాచారం లేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోడుమూరు రహదారిలో కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎర్రిస్వామి (30)చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎర్రిస్వామి గౌండా పని చేస్తుంటాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్లి రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తున్నాడు. కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాలు వద్ద ఓ ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఎర్రిస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కార్తీక శోభ

మొదటి సోమవారం ప్రత్యేక పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



రుద్ర కోటేశ్వరాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సంగమ తీరంలో సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు


పూజలందుకుంటున్న రుద్రకోటేశ్వరుడు


దుర్గాభోగేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు


మహానందిలో గోవుకు దాణా తినిపిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి


నంద్యాలలో పూజలు


మహానందిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది, నవంబరు 4 ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారం మహానంది క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. రద్దీని దృష్టిలో పెట్టుకొని తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయంలో అర్చకులు ప్రాతకాల సేవలతో పాటు మహా మంగళ హారతుల సేవను జరిపారు. భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయం ప్రాంగణంలోని రుద్ర గుండం కోనేరుతో పాటు రెండో ప్రాకారంలో భక్తులు కార్తీక పుణ్య స్నానాలను ఆచరించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చేత వేదపండితులు,అర్చకులు గోపూజను నిర్వహించి గోవుకు దానను తినిపించారు. మహిళలు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. దైవదర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈవోతో పాటు ఏఈఓ ఎర్రమల్ల మధు పర్యవేక్షించారు.

● మహానంది క్షేత్రంలో సోమవారం నందికి వందనం పూజా కార్యక్రమాన్ని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. రాత్రి పల్లకిసేవ ఉత్సవాన్ని ఆలయ వేద పండితులు వైభవంగా నిర్వహించారు.

ఆత్మకూరురూరల్: కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన రుద్రాణిసహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల సమయంలోనే ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. గుంటూరు నుంచి అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన గురుపు బాబాజీ ఆధ్వర్యంలో 50 మంది శిష్యగణంతో ఈ క్షేత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం అన్నదానానికి అవసరమయ్యే బియ్యం, నిత్యావసర వస్తువులను ఆలయ కమిటీ నిర్వాహకులు రాఘవరావుకు అందజేశారు.

కొత్తపల్లి: సప్తనది సంగమతీరంలోని సంగమేశ్వర క్షేత్రంలో కార్తీక సందడి నెలకొంది. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో ఆత్మకూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సత్ర బృందం ఆధ్వర్యంలో క్షేత్ర సన్నిధిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ శాస్త్రోక్తంగా చేయించారు. ముందుగా భక్తులు సంగమతీరంలో పవిత్ర స్నానాలు ఆచరించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం లలితా సంగమేశ్వరస్వామి ఉత్సవవిగ్రహాలకు, శివకేశవమూర్తులకు పూజల్లో పాల్గొన్న దంపతులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల పుష్పార్చన, తులసి దర్శన క్రతువులు చేయించారు.

నంద్యాల కల్చరల్: కార్తీకమాసం సందర్భంగా సోమవారం నంద్యాలలో పలు శైవక్షేత్రాలలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. హౌసింగ్‌బోర్డులో వెలసిన అమ్మ స్ఫటికలింగేశ్వరునికి ఉదయం నుంచి పంచామృత అభిషేకాలు, అర్చనలు, నిర్వహించారు.


సంగమేశ్వర క్షేత్రం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


కోనేటిలో స్నానం ఆచరిస్తున్న భక్తులు


మహానందిలో భక్తుల రద్దీ

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి పంటలను సాగు చేసిన రైతులు బీమా పథకానికి సంబంధించి ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల బీమా పరిహారం పొందాలంటే బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. తద్వారా ప్రకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయినట్లయితే పంటల బీమా పథకం ద్వారా పరిహారం అందనుందని వివరించారు. పంట బీమా వివరాలు జాతీయ పంటల బీమా పోర్టల్‌లో ఉంటాయని సూచించారు. ఇప్పటికే పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి బీమా ప్రీమియాన్ని బ్యాంకులే మినహాయించుకుంటున్నాయని అన్నారు. డిసెంబరు 15వ తేదీలోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

మినీ రింగ్ రోడ్డు ఏర్పాటుకు కసరత్తు

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశాలమైన రోడ్ల ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు కసరత్తును ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని పాతబస్టాండ్, కప్పలకుంట, కేజీరోడ్డు, నేతాజీనగర్, పోస్టాఫీజు ఏరియా తదితర ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగించిన అధికారులు తాజాగా ఆత్మకూరులో మినీ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా పట్టణంలోని కళాంజలి ప్రింటింగ్ ప్రెస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్, నేతాజీనగర్, తిక్కయ్యస్వామిదర్గా, తోటగేరి, గాంధీపార్క్, పెద్దబజారు, అమ్మవారిశాల, కొత్తపేట, పెద్దమసీద్ మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు మినీ రింగ్ రోడ్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి సీసీ రోడ్డును విస్తరించాలని మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయ రహదారిని కూడా డబుల్‌లైన్ రహదారిగా మార్చేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మినీరింగ్‌రోడ్డు ఏర్పాటు అయితే పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

రేపు సామూహిక వ్రతం

ఆత్మకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రంలో నవంబరు 6వ తేదిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరులోని ఆంజనేయ స్వామి ఆలయ అర్చకులు మేడవరం అనిల్ కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బుధవారం కొలనుభారతి క్షేత్రంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొలనుభారతి క్షేత్రంలోని ఆర్యవైశ్య అన్నదాన కేంద్రం వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ పూజల్లో భాగంగా కలశస్థాపన, గణపతిపూజ, అష్టలక్ష్ముల పూజ, కుంకుమార్చన, ఉసిరిచెట్టు పూజ, శ్రీరామాసమేత సత్యనారాయణ స్వామి వ్రతం, నవవిధాభిషేకం, నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక పూజలు, పంచలోకపాలక పూజలు, వేద ఉపనిషత్తులతో, గద్యాలతో పుష్పపూజ, కుంకుమార్చన క్రతువులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 9441086869, 9985577174లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రైతులకు పెట్టుబడి సహాయం అందించాలి

● ఏపీ రైతు సంఘం నాయకుల డిమాండ్

నందికొట్కూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు తక్షణమే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఐదో సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శి ఉస్మాన్ బాషకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, రైతు సంఘం నాయకులు రామకృష్ణ, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థినితో ఉపాధ్యాయులు

పాములపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాములపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పెరుమాళ్ళ మౌనిక అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు గోపాల్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజశేఖర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎపీఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలలో మంచి ప్రతిభ కనబరచి 6,7వ తేదీలలో ఏలూరు జిల్లా కైకవరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వంద మీటర్ల పరుగు పందెంలో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరచి విజేతగా రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధిపై శిక్షణ

మిడుతూరు, నవంబరు 4: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నామని ఎంపీడీవో దశరథరామయ్య అన్నారు. సోమవారం మిడుతూరు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు ఈవోఆర్డీ సంజన్న ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు పైబడిన నిరుద్యోగ యువతకు నైపుణ్య యాప్ ద్వారా విద్యా అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు నైపుణ్య యాప్ ద్వారా ఉపాధి పొందాలని ఎంపీడీవో కోరారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి చౌడప్ప డిమాండ్ చేశారు. సోమవారం సోమవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికుల కనీసవేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌టీయూ నంద్యాల డివిజన్ నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అశోక్, వెంకటేశ్వర్లు, లింగన్న పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పగిడ్యాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది కావడంతో రెండు రోజులుగా ఆలయ నిర్వాహకుడు విజేయుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆలయంలో పూజలు చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

శ్రీశైలం, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్ రెడ్డి సూచించారు. సోమవారం ఎమ్మెల్యే శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ఇంచార్జి కార్యనిర్వహణాధికారి ఈ. చంద్రశేఖరరెడ్డి అధికారులతో కలిసి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం కార్తీకమాసోత్సవాల ఏర్పాట్లను, క్యూలైన్లు, విరాళాల సేకరణ కుంద్రం, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యూలైన్లలో వెళ్తున్న భక్తులకు ఇబ్బందులు పడకుండా సౌకర్యవంతంగా స్వామిఅమ్మవార్లను దర్శించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తరువాత గో సంరక్షణశాలలో రోజువారి గోగ్రాసం వినియోగం, గో సంరక్షణకు వినియోగించే ఔషధాల వివరాలు, విభూతి తయారీ, విభూతి అమ్మకాలు పరిశీలించారు. గోవులన్నింటికీ శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పోష్టికమైన ఆహారం అందించాలని, గోవులకు అంటువ్యాధులు, సీజనల్ వాధులు ప్రబలకుండా టీకా మందులు వేయించాలని సిబ్బందికి సూచించారు. మార్కాపురానికి చెందిన ఎల్. వి ప్రసాద్‌రెడ్డి అనే భక్తుడు గో సంరక్షణశాలకు విరాలంగా గోవుల ఔషధాలను ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు.

● శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాదుకు చెందిన ఎం. దీపిక కుటుంబ సభ్యులు రూ. 1,01,116/-, సికింద్రాబాదుకు చెందిన జి. బంగారరావు కుటుంబ సభ్యులు రూ. 1,01,116/- విరాళాన్ని పర్యవేక్షకురాలు టి. హిమబిందుకు అందజేశారు. అదేవిదంగా అన్న ప్రసాద వితరణకు చిక్‌బళ్ళాపూర్‌కు చెందిన భక్తులు ఏ. పి. ఎం.సి. మర్చెంట్స్ భాస్కర్, మల్లికార్జునా, శివపావని, తొమ్మిది టన్నుల కూరగాయలను పర్యవేక్షకులు సి. మధుసూదన్ రెడ్డికి అందజేశారు ఈ కూరగాయల విలువ సుమారు రెండు లక్షల దాకా వుంటుందని దాతలు తెలిపారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

రోడ్డు పనులకు ఇసుక అందాలి: కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపన చేసిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఇసుక అందుబాటులో ఉండాలని, కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి గనులశాఖ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న పెన్షన్ మొత్తాలను తిరిగి జమచేయాలని ఆదేశించారు. అటవీ పరిధిలోని 48 చెంచుగూడేలలో 14 మండలాల సచివాలయ సిబ్బంది బృందాలను పైలట్ సర్వే నిమిత్తం పంపామని సిబ్బందికి స్థానికంగా సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాని సిద్ధం చేశామని ఈనెల 9,10, 23,24 తేదీలలో ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించి జాబితాలో చేర్పులు మార్పులు చేయాలన్నారు. నంద్యాల, డోన్ డివిజన్లలో రైల్వేశాఖ రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రోడ్డు అండర్ బ్రిడ్జ్ పనులపై నివేదికలను పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కరాటే పోటీలు

నంద్యాల, నవంబరు 4 : (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా జీత్‌కునేడో కరాటే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్, మాజీ వైస్ చాన్సలర్ డా.వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నంద్యాల క్రీడా సమాఖ్య అధ్యక్షుడు డా.రవికృష్ణ, ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్‌రావు, శాంతినికేతన్ విద్యాసంస్థల ఛైర్మన్ సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరాటే సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిజాముద్దీన్, రమేష్, క్రీడా భారతి జిల్లా కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెట్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు

నంద్యాల, నవంబరు 4 : (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన టెట్ ఫలితాల్లో నంద్యాలలోని రాజేశ్వరి కోచింగ్ సెంటర్ అభ్యర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి అధిక ర్యాంకులు సాధించారని డైరెక్టర్ రమేష్ తెలిపారు. ఎస్జీటీలో నారాయణమ్మ 150కి 130మార్కులు, నేహ 129మార్కులు, రమాదేవి 123మార్కులు, ఆఫ్షాన్ వలి 111మార్కులు, సరళాదేవి, జయలక్ష్మి 109మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. వంద మార్కులకుపైగా 30మంది అభ్యర్థులు మార్కులు సాధించారని పేర్కొన్నారు.

సర్వేలు పకడ్బందీగా చేపట్టాలి

వెలుగోడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెంచు గూడేలలో అధికారులు సిబ్బంది చేపట్టిన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆత్మకూరు డీఎల్‌డీవో సూర్యనారయణ అన్నారు. సోమవారంపట్టణంలోని చెంచు గూడేలలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చెంచుల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వృత్తి నైపుణ్యానికి సంబంధించిన సర్వే శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, పీఎస్ సుంకన్న, సిబ్బంది గౌస్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే దంపతులను విమర్శిస్తే సహించం'

పాణ్యం, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డిలను విమర్శిస్తే సహించేది లేదని జిల్లా ముస్లిం మైనార్టీ కార్యవర్గ సభ్యులు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గౌరు కుటుంబం దందాలకు పాలుపడుతుందని ఓ నాయకుడు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గత ఐదేళ్లుగా గౌరు కుటుంబం పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అలాంటి కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకలు మహబూబ్‌బాష, సుబ్బయ్య, కృష్ణ, .ఉశేన్‌భాష. ఖాజా పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

గోస్పాడు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అధికారులు గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ ఆర్థర్‌సైమన్ అన్నారు. సోమవారం ఎంపీడీవో అమానుల్లా ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అధికారులు పనిచేయాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. గ్రామాల్లో వీధి లైట్లు, పారిశుధ్యంపై చర్చించారు. వివిధ శాఖలపై సమీక్షించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జగదీశ్వరమ్మ, ఉపాధ్యక్షులు జనార్దనరెడ్డి, రాజు, ఈవోఆర్డీ నాగఅనసూయ. ఎంపిటీసిలు భక్తవత్సలరెడ్డి, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధారాణి, పరదేశి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి త్రోబాల్‌లో.. డబుల్ క్రౌన్ సాధించిన గురురాజ జట్లు


త్రో బాల్ విజేతలుగా గురురాజ జట్లు

నంద్యాల, నవంబరు 4 : (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో మూడు రోజుల నుంచి జరుగుతున్న 8వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి త్రో బాల్ జిల్లా స్థాయి బాల, బాలికల పోటీల్లో నంద్యాలకు చెందిన గురురాజ జట్లు బాల, బాలికల విభాగాల్లో డబల్ క్రౌన్ సాధించి ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందకుపైగా పాఠశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. సోమవారంతో పోటీలు ముగిశాయి. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. గురురాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన గురురాజ జట్లకు, బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన గురురాజ జట్టుతోపాటు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. క్రీడాకారులనుద్దేశించి అతిథులు ప్రసంగించారు. మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, ఏపీ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

కోతకు గురైన లోతుకుంట

వంద ఎకరాల్లో నీట మునిగిన వరి, చీని, మినుము పంటలు


చీని చెట్లలో ప్రవహిస్తున్న లోతుకుంట నీరు


కోతకు గురైన వరి పంట

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామ సమీపంలోగల లోతుకుంట సోమవారం కోతకు గురైంది. చేతికొచ్చిన వరి పంట నేల వాల్లింది. వంద ఎకరాల పంటలు నీట మునిగి భారీగా నష్టం వాటిల్లింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చాగలమర్రిలో వర్షం


వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో ముత్యాలపాడు, మద్దూరు, శెట్టివీడు, గొడిగనూరు, చాగలమర్రి గ్రామాల స మీపంలో సర్వీస్ రహదారులలో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడి చి దెబ్బతింది. ధాన్యాన్ని విక్రయించే సమయంలో కురిసిన వర్షం నష్టాన్ని మిగిల్చిందని రైతులు కన్నీటితో విలపించారు. జొన్న, మినుము, కంది తదితర పంటలు సాగు చేసిన రైతులకు ఈ వర్షంతో పంటలు ఊపిరి పోసుకున్నాయి.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి: ఎంపీడీవో

బేతంచెర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటి నైపుణ్య గణన యువత భవితకు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంటింటి గణన నైపుణ్య యువతకు భరోసా సర్వేపై మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్పీలు పవన్ నాయక్, నరేష్ నాయక్, రాజు నాయక్, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు, ఈవోఆర్డీ మల్లికార్జున, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి: సీపీఐ

డోన్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళారుల చేతుల్లో మోసపోకుండా రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, పట్టణ, మండల కార్యదర్శులు నారాయణ, మోట రాముడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ సమీపంలోని ఉడుములపాడు ప్రధాన రోడ్డులో ఉన్న హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు వరదరాజులు, అబ్బాస్, షమీమ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ప్యాపిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐశ్వర్యకి మాచిరాజు బాల సాహిత్య పీఠం పురస్కారం దక్కింది. సోమవారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఎంలపై ఒత్తిడి తగ్గించాలి

ప్యాపిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చి అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక అకౌంట్ రిజిస్ట్రి) ఐడీ జనరేట్ విషయంలో ఒత్తిడి తగ్గించాలని యూటీఎఫ్ నాయకులు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో వెంకటేశ్వరనాయక్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పొలాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు



పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంబలూరు గ్రామ రైతులు ఇటీవల కల్తీ వరి గింజలుతో నష్టపోతున్నామని కలెక్టరు రాజకుమారి, ఇన్‌ఛార్జ్ వ్యవసాయాధికారి సుధాకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. సోమవారం చిన్నకంబలూరు గ్రామ రైతులు సాగు చేసిన వరిపంట పొలాన్ని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాంపిల్స్ సేకరించారు. వీటికి సంబంధించిన నివేదికలను మండల వ్యవసాయాధికారికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.రామక్రిష్ణారావు, డాక్టర్ రవికుమార్ , డాక్టర్ ఎన్‌కే గాయత్రి, ఏఈవో రాజు, వీఏఏలు రేష్మా, చాణక్యుడు, శివక్రిష్ణ, నాగఫణీంద్రకుమార్ ఉన్నారు.

పంటల బీమా చేసుకోవాలి : ఏవో

అవుకు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా చేసుకోవచ్చన్నారు. హెక్టారుకు శనగ పంటకు బీమా రూ. 210, వరికి రూ. 315, జొన్నకు రూ. 149, మినుముకు రూ. 119, వేరుశనగకు రూ. 160, ఉల్లి పంటకు రూ. 225 రైతులు సచివాలయాల్లో కాని, మీసేవా కేంద్రాల్లో కాని, సీఎస్‌సీల్లో పంటల బీమా డబ్బులు చెల్లించాలన్నారు. శనగ, జొన్న, మినుము, వేరుశనగ, ఉల్లి పంటలకు డిసెంబరు 15వతేదీ లోగా చెల్లించాలని, వరి పంటకు డిసెంబరు నెల 31వతేదీ చివరి గడువని తెలిపారు. రైతుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న వాల్మీకి కమిటీ సభ్యులు

దొర్నిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమద్దిలేటి, కార్యదర్శి బాలుసేని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సుభద్రత, ఎస్ఐ వెంకటేష్‌లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దొర్నిపాడు మండల అధ్యక్షుడు రామదాసు, బుర్రారెడ్డిపల్లె అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నాగేష్, చాకరాజువేముల అధ్యక్షుడు బాలదాసు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి బాలయ్య, కృష్ణయ్య, శ్రీనివాసులు, పల్లె పెద్దఉసేని తదితరులు ఉన్నారు.

ఉల్లం‘ఘనులు’

- రహదారుల్లోనే రాళ్ల కుప్పలు
- కుచించుకపోతున్న ప్రధాన రహదారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- రక్షించాలని వేడుకుంటున్న వాహనదారులు


ఎన్‌హెచ్-544డి పక్కనే పడేసిన నాపరాళ్ల వేస్టేజీ

కొలిమిగుండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో నాపరాతి గనులు విస్తారంగా వెలిశాయి. అయితే నాపరాతి గనుల యజమానులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. మైనింగ్, రవాణా శాఖ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా ఉల్లంఘనులకు పాల్పడుతున్నారు. అధికారుల అలసత్వం.. స్వార్థపరుల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన రహదారులు కుచించుకపోతుండగా, వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

ఎన్‌హెచ్-544డి పక్కనే రాళ్ల కుప్పలు

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే అనంతపురం - అమరావతి జాతీయ రహదారి ఎన్‌హెచ్-544డి వెంబడి గనులు, పరిశ్రమల్లోని వేస్టేజీని పడేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈరహదారి గుండా ప్రయాణం చేస్తున్నా పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కొలిమిగుండ్ల మండలంలోని అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతమైన బందార్లపల్లె చెక్‌పోస్టు నుంచి, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, బెలుం, అవుకు మండలంలోని రామాపురం, అవుకు, బనగానపల్లె వరకు జాతీయ రహదారి వెంట వేస్టేజీని పడేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇది తీవ్ర అంతరాయం గా మారుతోంది. అలాగే ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రహదారులు ఉనికి కోల్పోతున్నాయి. మండలంలోని బెలుంశింగవరం, చింతాయపల్లె, తిమ్మనాయినిపేట, బందార్లపల్లె తదితర గ్రామాల ఆర్‌అండ్‌బీ రహదారుల్లో సైతం వేస్టేజీ వేస్తున్నారు. బెలుం, బెలుంశింగవరం గ్రామాలకు చెందిన ప్రజలు మీర్జాపురం చేరుకోవాలంటే కొలిమిగుండ్ల తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.


జాతీయ రహదారి పక్కనే కొండలా రాళ్ల గుట్టలు

బోర్డులు ఏర్పాటు చేసినా..

ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారుల పక్కన 45మీటర్ల వరకు గనులు చేయరాదని, వేస్టేజీ నాపరాళ్లు వేయరాదని బోర్డులు ఏర్పాటుచేసినా, అక్రమార్కులు ఏమాత్రం లెక్క చేయడంలేదు. బోర్డుల పక్కనే ఇష్టానుసారంగా నాపరాళ్ల వేస్టేజీని గుట్టలుగా వేస్తుండటంతో రహదారులు కుచించుకపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రహదారులను కాపాడాలని కోరుతున్నారు.


రోడ్లు, భవనాల శాఖ ఏర్పాటు చేసిన బోర్డు దగ్గరే కొండగా రాళ్ల కుప్పలు

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా: మంత్రి బీసీ


కొవెలకుంట్లలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

కొవెలకుంట్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడకండి, టీడీపీకోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉండి న్యాయం చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొవెలకుంట్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గ్రామాల వారీగా కార్యకర్తలను పిలిపించి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టవలసిన అభివృద్ధికార్యక్రమాలు, పనులపై వారితో చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో నాయకులు అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పొట్టిపాటి సుబ్బారెడ్డి, కలుగొట్ల అర్జున్‌రెడ్డి, వెలగటూరు ధనుంజయుడు, బిజినవేముల హుసేనయ్య, సౌదరదిన్నెసుబ్బారెడ్డి, అమడాలమద్దిలేటి, గుళ్లదుర్తి సుదర్శనరెడ్డి, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి,చిన్నకొప్పర్ల మాజీ సర్పంచ్ బుచ్చన్న, సుబ్బారెడ్డి, రేవనూరు నరసింహారెడ్డి, లింగాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంజామల: పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం సంజామల టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మంత్రి బీసీ ముచ్చటించారు. గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేసి అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి పేదోడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్ రెడ్డి, పెండేకంటి కిరణ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు మంచాల తులసి రెడ్డి, కాణాల కేశవ రెడ్డి, బెలుం సురేష్ రెడ్డి, రామిరెడ్డిపల్లె సర్పంచ్‌లు మంచాల వీరప్రతాప్ రెడ్డి, దాట్ల విజయ లక్ష్మి, శంకర్ రెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి, శీల వెంకటేశ్వర్లు, మల్కి హుసేన్, సుబ్బారావు, తోట శ్రీనివాస రెడ్డి, రవి, విష్ణువర్ధన్ రెడ్డి, పసుపల మహమ్మద్, మోహన్ రెడ్డి, మూసాని చంద్రశేఖర్ రెడ్డి, తిమ్మయ్య, యూనిస్, రామ గోవింద రెడ్డి, పరమేశ్ రెడ్డి, మోహన్ రెడ్డి, నల్లగట్ల చంద్ర శేఖర్ రెడ్డి, డీలర్ చంద్రశేఖర్ రెడ్డి, దానంశెట్టి రమణయ్య, గుర్కా రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని నడిబొడ్డున ఉన్న బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం బ్రిడ్జి మరమ్మతు పనులు స్వయంగా ఆయన పరిశీలించారు. అనంతరం బీసీ మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు.

యాగంటిలో మంత్రి పూజలు

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో కార్తీక మాసం తొలి సోమవారం శోభను సంతరించుకుంది. మంత్రి బీసీ జనార్దనరెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు సోమవారం తెల్లవారుఝామున యాగంటి ఉమా మహేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో, పూజారులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రుడు, పూజారులు, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు తిరుమలేశ్, యాగంటిపల్లె మహేశ్వర రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే యాగంటి, మార్కాండేయ ఆలయంలో, పలుకూరు రామేశ్వర ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

ప్రజా సేవకే అంకితం


ఆళ్లగడ్డలో బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజలకు సేవలందించడమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోందని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆళ్లగడ్డ నుంచి కర్నూలుకు వెళ్లే రెండు నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ వ్యవస్థ నిర్వీర్యమైందని, ఎన్నో సర్వీసులను తొలగించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నాలుగు కొత్త సర్వీసు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం పూట హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసును ఏర్పాటు చేయడంతో పాటు తిరుమల, శ్రీశైలం వెళ్లే ప్రయాణీకుల సౌకర్యార్థం మరిన్ని సర్వీసులు ఏర్పాటు చేస్తామని అఖిలప్రియ వెల్లడించారు. ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో మౌళిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిపో మేనేజర్ తిరుపతయ్య, కౌన్సిలర్ హుసేన్ బాషా, పలువురు టీడీపీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం: బీసీ ఇందిరమ్మ


కూరగాయల వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని ఇందుకు ప్రతి వ్యాపారి, ప్రజలు సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, కూరగాయల వ్యాపారి శేఖర్, వ్యాపారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు

- శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు


బేతంచెర్ల: అమ్మవారిశాలలో శివుడికి పూజలు చేస్తున్న భక్తులు


కొలిమిగుండ్ల: దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బేతంచెర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో ప్రకృతి కొండలలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఎంబాయి గ్రామ సమీపంలో భోగేశ్వరస్వామి ఆలయంలో పట్టణంలోని పూదోట మఠం ఆశ్రమంలో వెలసిన భేతేశ్వర స్వామికి ఆయా గ్రామాల భక్తులు, ప్రత్యేక పూజలు చేశారు.

శిరివెళ్ల: కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా శిరివెళ్లలోని కాశీవిశ్వేశ్వర సమేత బసవేశ్వర స్వామి ఆలయంలో, ఓంకారేశ్వర స్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు వేకువజామునే శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని ప్రసిద్ధి నేలబిళం మల్లేశ్వరస్వామి, బెలుం సిద్ధ రామేశ్వర స్వామి, కొలిమిగుండ్ల లలితాసుందరేశ్వర స్వామి, వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు సాయంత్రం దీపాలు వెలిగించారు. అలాగే కోరుమానుపల్లె గ్రామంలో వెలసిన శివాలయంలో కార్తీక మొదటి సోమవారం పురస్కరించుకొని సోమవారం రాత్రి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున స్థానిక శివాలయం చేరుకొని శివుడికి సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రామపెద్దలు తెలిపారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయం, భీమలింగేశ్వర ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా సోమవారం రాత్రి మహిళలు దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. కోదండరామాలయంలో మహిళలు 108 దీపాలు వెలిగించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భైరవేశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శివపార్వతుల పల్లకి ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

భగవద్గీత ప్రచారం

సంజామల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ప్రారంభం మొదటి సోమవారం సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక తాడిపత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆకుమళ్ల గ్రామంలో భగవద్గీత ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బాలయ్య, సభ్యులు రామానంద, చంద్రమోహన్, రవితేజ, బాబు, మద్దిలేటి, దత్త ఈశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సురేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెంచు కాలనీలో సమగ్ర సర్వే

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట, చెంచుగూడెం కాలనీలో సమగ్ర సర్వేను సోమవారం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, పంచాయతీ కార్యదర్శులు మనోజ్, ఫైరోజ్, వీఆర్వోలు, సోహెల్, శారదమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటళ్లు స్వాధీనం

రుద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో మద్యంసీసాలు ఉన్నట్లు సమాచారం అందడంతో సోమవారం దాడి చేసినట్లు ఎస్సై వర ప్రసాద్ తెలిపారు. ఆకుల రాముడు అనే వ్యక్తి వద్ద 18 మద్యంసీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా అమర్త్యసేన్ జయంతి

బనగానపల్లె, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులు రామన్న ఆధ్వర్యం లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ బాబునాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల తొలగింపునకు చర్యలు

ఉయ్యాలవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో విధులు సరిగా నిర్వహించని రేషన్ డీలర్లను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు సోమవారం తెలిపారు. మండలంలో ఎనిమిది మంది డీలర్లపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొలిమిగుండ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ తెలిపారు. సోమవారం చాగలమర్రిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అటవీ సంరక్షణే లక్ష్యం

డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్



డోన్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డోన్ అటవీ సంరక్షణే లక్ష్యమని డోన్ ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు.

ప్రశ్న: డోన్ ఫారెస్టు రేంజ్ పరిధిలో అటవీ విస్తరణం ఎంత..?

జవాబు: డోన్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాలు కలుపుకుని 34,269 హెక్టార్ల రిజర్వు ఫారెస్టు భూమి ఉంది.

ప్రశ్న: పులుల సంచారం ఏమైనా ఉందా..?

జవాబు: చిరుత పులుల సంచారం ఉంది. డోన్ మండలంలోని చనుగొండ్ల పరిసరాల్లో చిరుత పులుల సంచారం కదలికల సమాచారం అయితే ఉంది.

ప్రశ్న: చిరుత పులుల సంచారం ఉన్న చోట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: గతంలోనే చిరుత పులుల సంచారం పరిధిలో దండోరా వేయించి గ్రామస్థులకు అప్రమత్తం చేశాం.

ప్రశ్న: నగర వనం గురించి తెలియజేయండి..?

జవాబు: డోన్ మండలం ఎర్రగుంట్ల, డోన్ ప్రధాన రహదారిలో గత ప్రభుత్వ హయాంలో నగరవనం రూ2 కోట్ల నిధులతో ఏర్పాటైంది. ప్రస్తుతం సందర్శకుల సంఖ్య తగ్గింది. టికెట్ ధరలు నిర్ణయించాము. వాహనాల పార్కింగ్ చార్జీలు వసూలు చేయడం లేదు.

నేడు కోట్ల పర్యటన

ప్యాపిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చెరువును పరిశీలించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

9న ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె గ్రామ సమీపంలో వెలసిన ప్రసిద్ధి గుండం ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 9న ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల ఈడిగ సంఘం నాయకులు వెల్లడించారు. భక్తులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యత పాటించండి

రుద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేసిందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం రుద్రవరంలోని సీసీ రోడ్లపనులను పరిశీలించారు. సీఎం రోడ్డు నుంచి విద్యుత్‌సబ్‌స్టేషన్ వరకు సీసీ రోడ్డు 150 మీటర్లు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. రూ.8లక్షలు నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఇన్‌లైన్ క్లోరినైజేషన్ ఏర్పాటు చేయండి

రుద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాలలో వాటర్ పైపులైన్లకు ఇన్‌లైన్ క్లోరినైజేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. రుద్రవరంలో ఇన్‌లైన్ క్లోరినై జేషన్ ఆరు పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

ఉయ్యాలవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక నిర్వహిస్తున్నామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించిన సమస్యలకై ఐదుగురు అర్జీలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమమహేశ్వరరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

ఉయ్యాలవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో కుందూ నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆశ్రమంలో అవధూత బొమ్మన వెంకటసుబ్బారెడ్డి స్వామి 21వ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు స్వామి ఉత్సవాలు ఉంటాయన్నారు.

నేడు సర్వేపై శిక్షణ

ఉయ్యాలవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయా సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో ఉమమహేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం అల్లూరు, తుడుమలదిన్నె, హరివరం, కొండుపల్లె, ఆర్.జంబులదిన్నె సచివాలయాల వారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి పెద్దయమ్మనూరు, ఇంజేడు, బోడెమ్మనూరు, సుద్దమల్ల, మాయలూరు, ఉయ్యాలవాడ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. వీరికి గ్రామాల్లోని యువకు వృత్తి విద్యపై సర్వే చేయించి అర్హులైన వారికి ఆసక్తి ఉన్న దానిపై శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పించనున్నట్లు తెలిపారు.